# సన్నిధి క్రమావళి

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2026 చందా : 15.00

Bible Mission HQ Guntur

| | | | |
|---|---|---|---|
| మొదటి ముద్రణ | 2009 | ప్రతులు | 5000 |
| రెండవ ముద్రణ | 2011 | ప్రతులు | 6000 |
| మూడవ ముద్రణ | 2012 | ప్రతులు | 10000 |
| నాల్గవ ముద్రణ | 2013 | ప్రతులు | 5000 |
| ఐదవ ముద్రణ | 2014 | ప్రతులు | 10000 |
| ఆరవ ముద్రణ | 2015 | ప్రతులు | 10000 |
| ఏడవ ముద్రణ | 2016 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ ముద్రణ | 2017 | ప్రతులు | 5000 |
| తొమ్మిదవ ముద్రణ | 2018 | ప్రతులు | 5000 |
| పదవ ముద్రణ | 2019 | ప్రతులు | 15000 |
| పదకొండవ ముద్రణ | 2021 | ప్రతులు | 8000 |
| పన్నెండవ ముద్రణ | 2022 | ప్రతులు | 13000 |
| పదమూడవ ముద్రణ | 2023 | ప్రతులు | 8000 |
| పదునాల్గవ ముద్రణ | 2024 | ప్రతులు | 10000 |
| పదిహేనవ ముద్రణ | 2025 | ప్రతులు | 10000 |
| పదహారవ ముద్రణ | 2026 | ప్రతులు | 5000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు – 522 509.

ఫోన్ : 9949121777.

# త్రియేక దేవుని స్తుతి

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును ఆదియందును ఇప్పుడును, ఎల్లప్పుడును యుగా యుగములందు ఉండునట్లు మహిమ, మహామహిమ, ఘనత, కీర్తి, ప్రభావములు ఆయనకే చెల్లునుగాక!

# దైవలక్షణముల స్తుతి

1. దేవా! నీవు అనాది వ్యక్తివైయున్నావు. నిన్ను ఎవ్వరు కలుగజేయలేదు. నీయంతటనీవే ఉన్నావు గనుక నీకు వందనములు.

2. దేవా! నీవు వెలుగైయున్నావు. అందుచేతనే సూర్య, చంద్ర, నక్షత్రములకు వెలుగునిచ్చినావు. జీవులలో కండ్లకు వెలుగు నిచ్చినావు. గనుక నీకు స్తోత్రములు.

3. దేవా! నీవు జ్ఞానమైయున్నావు. అందుచేత దేవదూతలకు, మనుష్యులకు, జీవరాసులకు జ్ఞానమిచ్చినావు. అట్టి జ్ఞానము వలన అనేక మర్మములు తెలియుచున్నవి. మా జ్ఞానమునకు నీవు బైలుపడినావు గనుక నీకు స్తుతులు.

4. దేవా! నీవు ప్రేమవైయున్నావు. గనుక జీవరాసులు ఒకదానినొకటి ప్రేమించుకొనుచున్నవి. అలాగుననే మనుష్యులుకూడ ఒకరినొకరు ప్రేమించు కొనుచున్నారు గనుక నీకు స్తుతులు.

5. దేవా! నీవు న్యాయమై యున్నావు. గనుక నీవు క్షమించేవాడవు. అయినప్పటికిని తప్పుచేసినవారిని శిక్షించి, క్షమించేవాడవు గనుక నీకు ప్రణుతులు.

6. దేవా! నీవు పరిశుద్ధుడవైయున్నావు. అందుచేత లోకములో పాపమున్నప్పటికిని పరిశుద్ధతకూడ ఉన్నది. వర్ష జలములలో, కాయలలో పరిశుభ్రత కనబడుచున్నది. మనుష్యులలో పాపమున్నప్పటికిని పరిశుద్ధతకూడ ఉన్నది గనుక నీకు నమస్కారములు.

7. దేవా! నీవు శక్తివైయున్నావు. కాబట్టి మానవులకు, జీవరాసులకు శక్తి యిచ్చినావు. గనుక వారు నడువగలరు, పనిచేయగలరు, గనుక నీకు మంగళ స్తోత్రములు.

8. దేవా! నీవు సర్వవ్యాపివై యున్నావు. అందుచేతనే అన్నిచోట్ల నీ ప్రభావము అనగా ప్రేమ, జీవము, పరిశుద్ధత, నీ పని, నీ కాపుదల కనబడుచున్నది. గనుక నీకు నిత్యమంగళ స్తుతులు.

9. దేవా! నీవు నిరాకారుడవైయున్నావు. అందుచేతనే పాపులమైన మాకు కనబడవు. కనబడని తండ్రివి అయినప్పటికిని దర్శనములలో కొందరికి, స్వప్నములలో కొందరికి కనబడుచున్నావు. గనుక నీకు హృదయపూర్వక వందనములు.

10. దేవా! నీవు స్వతంత్రుడవైయున్నావు. స్వేచ్ఛాపరుడవైయున్నావు. నీకు ఎవ్వరును సలహానియ్య నక్కరలేదు. అన్నియు నీ ఇష్టప్రకారమే చేయగలవు. గనుక నీకు హృదయపూర్వక వందనములు.

దేవా! నీయొక్క దివ్య లక్షణములు దేవదూతలకు, మనుష్యులకు ఇచ్చినావు. గనుక స్తోత్రములు. దేవదూతలలో ఒక దూత పాపములో పడి నీ సద్గుణములు లేకుండ చేసికొన్నది. అలాగే మనుష్యులు పాపములోపడి నీ గుణములు చాలావరకు పోగొట్టుకొనుచున్నారు. అయినను నీవు వారియెడల దీర్ఘశాంతము కలిగి యున్నావు. గనుక నీకు వందనములు. మరియు ఓ దేవా! నిన్ను అడిగే వారికి నీ శక్తులు దయచేయుదువు. గనుక నమస్కారములు. దేవా! నీ ప్రియకుమారుడైన యేసుక్రీస్తును లోకమునకు పంపించి ఆయనలో నీ గుణములు బయలుపర్చినావు. గనుక నీకు అనేక స్తుతులు. మరియు దేవా! సృష్టిలోని వస్తువులను పరీక్షించిన నీ సుగుణములు అందులో ఉన్నవి గనుక నీకు స్తుతులు. మరియు దేవా! నిన్ను నమ్మినవారిలో నున్న దుర్గుణములు దూరముగా తీసివేసి, మోక్షమునకు చేర్చుకొనుచున్నావు. అక్కడ శాశ్వతముగా వారు నీ దివ్యలక్షణములను అనుభవిస్తున్నారు. గనుక నీకు మంగళ స్తోత్రములు.

# సైతాను నెదిరించు సూత్రములు

## ప్రారంభ ప్రార్థన

ఓ త్రియేక దేవుడవైన తండ్రీ! సాతానును ఎదిరించ వలెనని నీ వాక్య గ్రంథములో వ్రాయించినావు. ఇదిగో ఇప్పుడే నీ సన్నిధానమందు వాటిని ఎదిరించుచున్నాము. మా ఎదిరింపుల వలన సైతానుకు వేదన, నిస్సత్తువ కలిగించుము. మా ఎదిరింపుల వలన నీకు మహిమ, సంఘమునకు జయము కలిగించుము.

దయగల తండ్రీ! సర్వశక్తిగల తండ్రీ! మేము సాతానును ఎదిరించుటకు నీ సర్వశక్తిలో నుండి మాకు శక్తిని దయచేయుము. శత్రువు బలమంతటిమీద మీకు అధికారమిచ్చియున్నానని లూకా 10వ అధ్యాయములో వ్రాయించినావు. కాబట్టి మా తండ్రీ! ఆ అధికారమును మేము వాడుకొనే కృప దయచేయుమని ప్రభువు నామములో వేడుకొనుచున్నాము. సర్వలోకమును సృష్టించిన సృష్టికర్తయైన తండ్రియొక్క నామములో, సర్వ లోకమును రక్షించిన రక్షణకర్తయైన యేసుప్రభువుయొక్క నామములో, సర్వలోకమును ఆదరించుచు, ఆయత్త పరచుచున్న పరిశుద్ధాత్మ తండ్రియొక్క నామములో, త్రియేక దేవుని నామములో, గాలి లోకములో బంధకములోయున్న *ఓ సాతానా! సాతాను అనుచరులారా! దురాత్మలారా! దురాత్మల సమూహములారా! దయ్యములారా!*

*భూతములారా! పిశాచములారా!* మేము మిమ్ములను ఎదిరించుచు, గద్దించుచున్నాము. గనుక మా ఎదిరింపులు, గద్దింపులు జాగ్రత్తగా ఆలకించుమని త్రియేక దేవుని నామములో మీకు ఆజ్ఞాపించుచున్నాము.

## 1. సైతానును ఎదిరించుట

1. ఓ సైతానా! మానవులకు నిన్ను ఎదిరించు సూత్రములు తెలియక నీకు భయపడుచున్నారు. అందుచేత నీవు శోధించేటప్పుడు పాపములో పడిపోవు చున్నారు. తల చితికిపోయిన సర్పము యొక్క తోక కదులుచుండుట చూచి, చిన్నపిల్లలు భయపడుదురు గాని పెద్దవారు భయపడరు. అలాగుననే విశ్వాసులు నీ క్రియలు చూచి భయపడరు. నీలో బలములేదని తెలుసును. నిన్ను *మా ప్రభువు జయించినాడు గదా! ఆ జయము మా పక్షముగా నున్న జయము గనుక నిన్ను జయించినట్లే.*

2. ఓ సాతానా! 'అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీయొద్ద నుండి పారిపోవును' (యాకోబు 4:7) అని వాక్యము చెప్పుచున్నది. ఆ వాక్య వాగ్దానమే నాకాధారము. అయితే ఇదివరకు నేనాలాగు చేయలేదు, గనుక నీవు నన్ను లోకువగట్టి మాట్లాడినావు. నేను బెదిరినాను గనుక నాకు సరియైన దర్శనము రాలేదు. బెదరకపోతే మహిమగల దర్శనాలే వచ్చియుండును. దర్శనములు రాకపోవుటకు నీవు కాదు కారణము, నా

బెదరే కారణము. నేను గొప్ప పని చేస్తున్నానని నీవు అనుకొనుచున్నావు.

3. ఓ సైతానా! మిఖాయేలు దేవదూత నీతో, మోషే శరీరమును గురించి వాదించినప్పుడు, నిన్ను గద్దించుటకు, దూషించుటకు ప్రయత్నించలేదు గాని *'యెహోవా నిన్ను గద్దించును గాక!'* అని చెప్పెను (యూదా 9వ వచనము). ప్రభువు మిఖాయేలుకు ఒక్కమాటే ఇచ్చినాడు గనుక ఆ ఒక్కమాటతోనే నిన్ను ఎదిరించినాడు. అయితే బైబిలులో అనేకమైన మాటలు ప్రభువు మాకు ఇచ్చియున్నారు గనుక ఆ మాటలతో నిన్ను గద్దిస్తాము గనుక విను.

4. ఓ సైతానా! నిన్ను ఎదిరించవలెనని వాక్యములో నున్నది గనుక నిన్ను ఎదిరించుటకు మాకు దైవాధికారము కలదు. మరియు శీఘ్రముగా నిన్ను మా పాదముల క్రింద (ప్రభువు) చితుక త్రొక్కించును (రోమా 16:20) అని వ్రాయబడియున్నది. కాబట్టి నిన్ను ఎదిరించుటకు, త్రొక్కుటకు మాకు సర్వాధికారమున్నది. నీవు త్రియేక దేవుని ఎదిరించినావు, అందుచేత మేము నిన్ను ఎదిరిస్తున్నాము. మరియు నీవు మా ప్రభువును, సిలువ మ్రానుమీద అంటగొట్టించినావు. మేము నిన్ను మా కాళ్ళ క్రిందవేసి త్రొక్కుటవలన, నీ శిరస్సును, నీ ముఖమును, నీ చేతులను,

నీ కాళ్ళను, నీ ప్రక్కను త్రొక్కివేస్తున్నాము. ఇట్టి పని నీవు మా ప్రభువునకు, సిలువ మ్రాను మీద చేయలేదా? ఇప్పుడు మేము నీకు చేస్తున్నాము. సర్పమును చంపువారు ఎక్కడైనను కొట్టి సంతుష్టి పడరుగాని, దాని తల చితుక గొడితేనే గాని వదలిపెట్టరు. అలాగే మేము నిన్ను చితుకగొట్టక మానము. అనగా నీవు నీ తలలో ఆలోచిస్తున్న ఆలోచనలన్ని చితుకగొట్టి, నీ ప్రయత్నములు సాగనీయకుండ చేయుదుము.

5. ఓ సైతానా! *'ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి, ఆయనయందు బలవంతులై యుండుడి'* (ఎఫెసీ 6:10) అని వ్రాయబడియున్నది. గనుక మేము నిన్ను గద్దించినా, చివాట్లు పెట్టినా, నీ ప్రయత్నములు చిన్నాభిన్నము చేసినా, మా ప్రభువు యొక్క బలమును బట్టి చేస్తాము. మా కోరిక నెరవేరుతుంది, నీ కోరిక శూన్యమౌతుంది.

6. ఓ సైతానా! నీవు మా ప్రభువును చూచి, 'నీవు పరిశుద్ధుడవు' అని అన్నావు (లూకా 4:34). అప్పుడాయన ఏమన్నాడు? 'ఊరుకో' మన్నాడు, అలాగే నీవేదైనా అన్నా, మంచిమాట అన్నా, చెడ్డమాట అన్నా, మేము కూడ 'నోరుముయ్!' అంటాము. మాకు అట్టి అధికారము గలదు. యేసుప్రభువు పరిశుద్ధుడే, నీవన్న మాట ఆయనకు తగినదే కాని ఆయన ఒప్పుకోలేదు. అలాగే నీవు మా మనస్సులో ఏదైనా ఒక మంచి మాట అంటే, మేము కూడ ఒప్పుకొనము. అప్పుడు నీవు సిగ్గుపడవలెను.

7. ఓ సాతానా! మా ప్రభువు నిన్ను చూచి, 'సాతానా! నా వెనుకకు పొమ్మని' కసిరినాడు (మత్తయి 16:23). వెంటనే పారిపోయినావు, వెనుకకు చూడకుండ పారిపోయినావు. నీవు మా తలంపులలో, మా స్వప్నములలో, మా దర్శనములలో మాకు కనబడితే, మా ప్రభువు అన్నమాటే మేముకూడ అనగలము. అప్పుడు నీవు వెళ్ళిపోవలసినదే. నీవు మా ప్రభువు యొక్క సెలవు మీద వచ్చినప్పటికిని, మా సెలవుమీద పారిపోవలసినదే.

8. ఓ సాతానా! 'దుష్టుడు ఎవడును తరుమకుండానే పారిపోవునని, (సామెతలు 28:1)లో వ్రాయబడియున్నది. మానవులలోనున్న దుష్టునికంటే నీవు ఎక్కువ దుష్టుడవు. మానవుని దుష్టునిగా మార్చిన దుష్టుడవు. కాబట్టి నీవు మరింత వేగముగా పారిపోవలెను. ఎప్పుడనగా మేము ఇటువంటి సమావేశములు, ప్రభువు సేవ, బైబిలు పఠన చేసి– 'సాతానా! మా సమావేశములకు ఎందుకు వచ్చావని' చెప్పి, నిన్ను వెళ్ళిపొమ్మని అనకపోయినప్పటికిని, నీవు వెళ్ళిపోవలయును. మా పరిశుద్ధ ఆచారములను చూచి, నీవు సహించలేవు గనుక పారిపోవలెను. అట్లే నీ దుష్టత్వమును చూచి, ఎవరైనా దేవదూతలు వచ్చి తోలివేస్తారేమోనని ముందే పారిపోవుదువు. గనుక మాకు జయము, నీకు అపజయము మరియు అవమానము.

9. ఓ సైతానా! మా ప్రభువు నీకు 'సైతానని' పేరు పెట్టినాడు. ఆ పేరునకు నీవు తగినవాడవు. అనగా నీ పేరునకు 'తీర్పు పొందదగినవాడవనే' అర్థమున్నది (మత్తయి 4:10). గనుక సాతానా! నీ పేరునకును, **'పొమ్ము'** అను ఆజ్ఞకును సంబంధము ఉన్నది. కాబట్టి నీవు పోయేవాడవే కాని ఉండేవాడవు కావు. ఆ మాట నీకు తగియున్నది. ఆ మాట మేముకూడ వాడవచ్చును. ఆ మాట మా ప్రభువు అన్నప్పుడు నీవు ఎలాగైతే వెళ్ళిపోయినావో, అలాగే ఇప్పుడు మేము ఆ మాట అన్నప్పుడు కూడ నీవు వెళ్ళిపోవాలి. ఓ సైతానా! నీవు ఎటువంటివాడవో ఆ సంగతి మాకు తెలియకుండ మారు వేషముతో వస్తావని, బైబిలు గ్రంథములోని కథల వలన తెలిసికొన్నాము. నీవు ఆత్మస్వరూపివైనప్పటికిని, సర్ప రూపముతో మా ఆది తల్లి దగ్గరకు వచ్చినావు గదా! నీ వెంత మారువేషములో వస్తే మాత్రము మాకు తెలియదేమిటి! దైవ వాక్యమువల్ల నీ నిజస్థితి ఎట్లు తెలియునో, అట్లే మా ప్రభువు వల్ల కూడ తెలియును. మా అనుభవమువల్ల కూడ తెలియును, మా జ్ఞానము వల్ల కూడ తెలుస్తుంది. కాబట్టి నీవు మరుగైయుండలేవు. *దొంగ, దొంగయని యజమానునికి తెలియగానే వాడు పారిపోవునట్లు, నీవును పారిపోవుదువు.*

10. ఓ సాతానా! మా ప్రభువు భూమిమీద నున్నప్పుడు, ఆయన ముఖ్యమైన పనులలో ఒక పని,

దయ్యములను వెళ్ళగొట్టుటయే. ఆ పనే మాకు కూడ అప్పగించినాడు (మార్కు. 1:17). గనుక వెళ్ళగొట్టుట మా పని, పారిపోవుట నీ పని.

11. ఓ సాతానా! నీవు 'మా మీదికి దండెత్తుదునని' అంటున్నావు. ఈ సంగతి మాకు తెలియదా! మేము ప్రార్థించగానే దండెత్తుదువని మాకు తెలిసినదే. నీవు అనడము వలన నీ తెలివి తక్కువతనము కనబడుచున్నది.

12. ఓ సాతానా! మొదటి శతాబ్ధములోనే లోకమంతటిని గురించి యేసుప్రభువు యొక్క శిష్యులు, భక్తులు ప్రార్థించలేదా! అప్పుడు నీవు ఎక్కడికి వెళ్ళినావు? మేము ఇప్పుడు ప్రార్థించుచుండగా, మమ్ములను అడగడానికి నీవెవ్వడవు? నీవు దయ్యానివి గాన నీ బుద్ధి కనబరచుచున్నావు.

13. ఓ సాతానా! డాక్టర్ మార్టిన్ లూథర్గారు వ్రాసిన చిన్న ప్రశ్నోత్తరి, నీవు ఎప్పుడైనా చదివినావా? అందులో మూడవ మనవియొక్క అర్థములో శరీరము, లోకము, సైతాను మొదలగునవి, దేవుని చిత్తము జరుగకుండ ఆటంకపరచునవి గనుక వాటిని ఎదిరించవలెనని ఉన్నది.

14. ఓ సాతానా! నీవు మా కూటస్థులను విడదీస్తా నంటున్నావు. ఆలాగున విడదీస్తే, మేము అనేక చోట్లకుపోయి, సన్నిధి కూటములు పెట్టుదుము. అప్పుడు నీకింకా కష్టము, నష్టము జాగ్రత్త.

15. ఓ సాతానా! పాములవాడు బూర ఊదగా, పాము బయటకు వచ్చును పాము ఎందుకు బయటకు వచ్చును? చావునకు వచ్చును! అలాగే మా ప్రార్థనలు అన్నీ విని, కోపముతో నీవు బయటకు వస్తున్నావు. గనుక నీ అంతము దగ్గరకు వచ్చినది. అది నీకు తెలియడము లేదు.

16. ఓ సైతానా! నీవు ఆడ మనిషివి కావు, మగ మనిషివి కావు. గనుక నిన్ను ఒకసారి ఆడ మనిషిగాను, మరియొకసారి మగవానిగాను చేసి మాట్లాడుదుము. నిన్ను అంత నీచముగా చూస్తున్నాము, అయినను నీకు సిగ్గులేదు.

17. ఓ సాతానా! నీవు మా స్వంత అవయముల మీద బాణములు వేసినావు. నీవు ఆకారము లేనివాడవు, అయినను నీకు మా వంటి అవయవములు నిరాకారముగా నున్నవని గ్రహించి, నీ నిరాకార అవయవముల మీద మేము బాణములు వేయుచున్నాము.

18. ఓ సాతానా! నీ దూతలు నిన్ను చూచి, 'నీవల్ల మేము కూడ చెడిపోయినాము' అని వారు నిన్ను ఎదిరిస్తారేమో! అప్పుడు నీకు మరింత బాధ. అందుకు నీవు, 'నేను శోధిస్తే మాత్రము మీరెందుకు పడవలెను' అంటే అప్పుడు వారికి బాధ. కాబట్టి నీకు, నీ దూతలకు బాధపడే యోగము పట్టును.

19. ఓ దయ్యములారా! మీరు విశ్వాసుల మీద బాణములు వేయునప్పుడు, వారు కూడ మీ మీద బాణములు వేయుదురు. కాబట్టి మీకు ఎల్లప్పుడు తెరిపిలేని బాణములు. మీరు తప్పించుకొనలేరు.

20. ఓ సైతానా! ఆదాము మొదలుకొని లోకాంతము వరకు, భూమిమీద ప్రవేశించిన పాపములతోపాటు, వాటి ఫలితములు ఇదివరకే నీ ముఖము మీదికి విసరి వేసినాము. అయితే ఇప్పుడు నీ మీదకు, నీ దూతల మీదకు అసహ్యమైనవి, హానికరమైనవన్నియు విసరి వేయుచున్నాము. అవేవనగా బంద, చెత్త, జంతువుల యొక్కయు, పక్షుల యొక్కయు, జీవరాసుల యొక్కయు, పురుగుల యొక్కయు మలినము నీ ముఖమున వేయు చున్నాము. ముండ్లు, తుపాకి గుండ్లు, కత్తులు, బళ్ళెములు, ఈటెలు, కొట్టే కర్రలు, కొట్టే రాళ్ళు, నీ మీదికి విసరి వేయుచున్నాము. జీవరాసుల యొక్క శవములుకూడ నీ మీదికి విసరి వేయుచున్నాము. నీవు చెలరేగుచున్నావు గనుక మేముకూడ చెలరేగుచున్నాము. ***నీవు ఇప్పుడైనా మారుమనస్సు పొందుము.*** తలకు సంబంధించిన పిచ్చి తనము మొదలగు వ్యాధులు, చెవికి సంబంధించిన వ్యాధులు, కండ్లకు సంబంధించిన వ్యాధులు, నోటికి

సంబంధించిన వ్యాధులు, ఊపిరికి సంబంధించిన వ్యాధులు, కాళ్ళకు సంబంధించిన వ్యాధులు, ఉదరమునకు సంబంధించిన వ్యాధులు, చేతులకు సంబంధించిన వ్యాధులు, చర్మమునకు సంబంధించిన వ్యాధులు, రక్తమునకు సంబంధించిన వ్యాధులు, నాసికకు సంబంధించిన వ్యాధులు, శరీరములో ప్రతి భాగమునకు సంబంధించిన వ్యాధులు, మనసునకు కలిగే గందర గోళములు, అపనమ్మిక, భీతి, విసుగుదల, సణుగు, సందేహము, కోపము, అసూయ, దిగులు మొదలగున వన్నియు ఓ సాతానా! నీ మీదికే విసరి వేయుచున్నాము.

21. ఓ సాతానా! ఆది సర్పము, ఘట సర్పము, సైతాను, అపవాది, శోధకుడు మొదలగు నీ పేరులలో ఏదీ మంచి అర్థము లేదు, చెడుగే ఉన్నది. గనుక నీవు సంతోషించవలసిన పని లేదు. నీ పేరు చెడుగే, నీ అపజయము చెడుగే, నీదంతయు అన్నియు చెడుగే. కాబట్టి మా మీద అధికారము చేయలేవు. మాలో చెడుగున్నను అది నీవు అంటించిన చెడుగే కాని, నీవలె తెచ్చిపెట్టుకొనుటకు, మేము సృజించిన చెడుగు కాదు. ఓ భూతమా! నీవు అతిశయింప పనిలేదు.

22. ఓ సైతానా! మనుష్యులలో కొందరు నీ మాటలకు లోబడి, నీ వలె దయ్యములుగా మారి, మనుష్యులలో ప్రవేశించి కీడు చేయుచున్నారు. ఇవికూడ నీ దుష్ట క్రియలే.

23. ఓ సాతానా! నీకు నిజము చెప్పడము ఎప్పుడైనా తెలుసునా? తెలియదు. అబద్ధము చెప్పుట మాత్రము సులువుగా తెలుసును, గనుక జాగ్రత్త.

24. దుష్టుడవైన ఓ సాతానా! 'నేను ఆత్మ స్వరూపిని, బలము గలవాడనని' అనుకొని విర్రవీగుచున్నావు. నీ దృష్టికి మానవులమైన మేము, బలహీనులుగా కనిపించు చున్నామా? అయితే, 'బలమైన సర్పము 'చలి చీమల చేత చిక్కి చచ్చెను గదరా' అను పద్యము నీకు బాగుగా వర్తించును. ఒకవేళ మేము ఆత్మీయ జీవనములో బలహీనులముగా నున్నప్పటికిని, మేము చేసే ప్రార్థనలు నీకు ములుకులై, నిన్ను బంధించి, తుత్తునియలుగా నలగ గొట్టునని గుర్తుంచుకొనుము అప్పుడైనా నీకు బుద్ధి వస్తుందేమో!

25. ఓ సైతానా! మేము నిన్ను ఎదిరించేటప్పుడు నీ సైన్యమంతటిని ఎదిరించినట్లే. మా ఎదిరింపులు నీకు, నీ సైన్యమంతటికిని చెందును.

## శిరచ్ఛేదనమునకు శిరచ్ఛేదన

1. ప్రధాన దూతయొక్క మనస్సులో (శిరస్సులో) అనాదిలో, 'దేవునితో తాను సమానమను' చెడుతలంపు పుట్టించుకొన్నాడు. ఇది అతని శిరస్సులోనిదే.

2. అతడు దైవ సంకల్పమును భగ్నము చేయుటకు, హవ్వలో దైవాజ్ఞకు విరుద్ధమైన తలంపు పుట్టించినాడు. ఆ తలంపు అతని శిరస్సులోనుండి వచ్చినదే.

3. ఆదాము, హవ్వలను శాపగ్రస్తులనుగా చేయవలె ననునది, అతని శిరస్సులోనిదే.

4. ఎన్ని పర్యాయములు మానవులలో పాపములను చేయు కోరిక పుట్టుచున్నదో, అన్ని పర్యాయములు అది సాతానుయొక్క శిరస్సునుండి వచ్చుచున్నదని గ్రహింపవలెను. పొడపాము మనుష్యుని బొటనవ్రేలిమీద ఊది, పుట్టలోనికి పోయినప్పటికిని, ఆ ఊపిరి శరీరమంతా వ్యాపించి కుళ్ళిపోవును. అలాగే ఎప్పుడో సాతాను ఊదిన పాపము నేటివరకు వచ్చుచున్నది. ఇది అతని శిరస్సులోనిదే.

5. పది యాజ్ఞలను జ్ఞాపకము చేసికొనగా ఏమి తేలుచున్నది? దైవాజ్ఞలకు విరుద్ధమైన పాపములు చేయవలెనను కోరిక మనిషిలో పుట్టుచున్నది. అది సాతానుయొక్క శిరస్సులోనిదే.

6. దేవుడు లేనేలేడను తలంపు, సాతాను కొందరిలో పుట్టించినందున వారు నాస్తికులైరి. ఆ తలంపు సాతాను యొక్క శిరస్సునకు సంబంధించినదే.

7. దేవుడు చేసిన ఉపకారములను తలంచుకొని, స్తుతిచేయుటకు సిద్ధపడి కూర్చున్న విశ్వాసియొక్క హృదయములోనికి వెళ్ళి, స్తుతి చేయకుండ ఆపుచేయువాడు సాతాను. కష్టములు కలిగినప్పుడు అతడు దేవునిమీద విసుగుదల పుట్టించి స్తుతి జరగనీయడు. ఒక్కడే కుమారుడైయుండగ, 'ఆబిడ్డను కూడ దేవుడు తీసికొనినాడు, ఓర్వలేకపోయినాడను' తలంపు పుడితే ఎట్లు స్తుతి

చేయగలరు? ఆ చెడ్డ తలంపు సాతానుయొక్క శిరస్సునకు సంబంధించినదే.

8. ఇంటిలోనే ఉండి ప్రార్థన చేసికొంటే చాలదా! గుడికెందుకు వెళ్ళవలెను? అను తలంపు కొందరికి కలుగును. ఇదికూడ సాతాను శిరస్సుకు సంబంధించినదే.

9. చదువుకొన్న పిల్లలలో కొందరు– 'మేమెందుకు తల్లిదండ్రుల మాట, పెద్దలమాట వినవలెను? ఇతరులెంత పెద్దవారైనప్పటికిని మేమెందుకు వందనము చేయవలెను? అని కొంతమంది పిల్లలు, తమ ఇష్టప్రకారముగా సంచరింతురు. ఇటువంటి తలంపు సాతాను శిరస్సులోనేదే.

10. తిట్టుట, కొట్టుట, చంపుట మొదలైనవి మానవులలో కొందరియొద్ద నుండు దుర్గుణములు. ఇవి కూడ సాతాను శిరస్సులోనివైయున్నవి.

11. కుటుంబ సంబంధమైన కలహములు, ఆపదలు, పాపములు, సాతాను శిరస్సు తెచ్చిపెట్టినవే.

12. ఆకలివేస్తే ఒకరి ఇంటిలోనివి తీసికొని తింటే ఏమి తప్పు? అని కొందరు దొంగతనము చేయుదురు. ఇది కూడ సాతానుయొక్క శిరస్సుకు అన్వయించినదే.

13. ఒకరిని అల్లరిపెట్టుచు, అతని తప్పును బైటపెట్టు గుణములు చాలమందిలో నున్నవి. దాని జన్మస్థానము సాతానుయొక్క శిరస్సు (అన్ని అబద్ధములు సాతానుకు సంబంధించినవే).

14. పది యాజ్ఞలలో నున్నటువంటి పాపములే కాక, బైబిలులో ఇతరచోట్ల ఉదహరించియున్న పాపములు అతని శిరస్సులోనివే.

15. బైబిలు ఉదహరించియున్న పాపములే కాక మన కాలము వరకు వస్తూయున్న, క్రొత్త క్రొత్త పాపములు గూడ సాతాను శిరస్సులోనివే.

16. దేవునిరాజ్యము భూమిమీద వ్యాపింపబడ కుండునట్లుగా అడ్డములు బెట్టుట, సాతాను యొక్క శిరో కార్యములే.

17. మహా ముఖ్యముగా క్రీస్తు సంఘమును నమ్మకుండ చేయువాడు అపవాది. దీనిలో అతని శిరస్సునకు ఎక్కువ సంబంధము కలిగియున్నది.

18. పాపమును విసర్జించుట, రక్షణను పొందుట, రాకడకు సిద్ధపడుట అను ఈ మూడును వట్టివే అనిపించుట, అతని శిరస్సుయొక్క పని.

19. పరలోకము, నరకలోకము లేవు. హేడెస్సు లేదనిపించుట అతని శిరో వృత్తి.

20. ఇవిగాక శాఖోపశాఖలుగా నున్నటువంటి పాపములు అనేకములున్నవి. అవికూడ అతని శిరస్సునకు సంబంధఇంచినవే.

21. సాతాను, అతని చెడ్డదూతలు అనగా 'భూతము లున్నవి' అను బోధ వట్టిదే అనిపించుట అతని పని.

22. ఆ పైన ఉదహరించిన సాతాను యొక్క దురాలోచనలు మాత్రమేగాక కర్ణ దోషములు, నేత్ర దోషములు, హస్త దోషములు, పాద దోషములు ఈ మొదలైనవి కూడ అతని శిరస్సుయొక్క పనులే.

23. పైన వ్రాసియున్నవన్నియు కలిసి, సాతాను యొక్క శిరస్సగును. అపవాదికి శరీరము లేదు, మన శిరస్సు వంటి శిరస్సు లేదు. అయినప్పటికిని నిరాకారముగా నుండు, ఈ ఇరవై మూడు దుర్గుణములున్నవి. **అవియే అతని శిరస్సు.**

**గమనిక:–** భయంకరమును, పాపభూయిష్టమునైన ఈ సాతానుయొక్క శిరచ్ఛేదనము చేయుటకై, ప్రతి క్రైస్తవుడు ఈ ప్రార్థన చేయుట అవసరము.

## సాతాను నెదిరించు పద్యము

సీ॥ సాతాను సర్పమా! సర్వకార్యములందు
శ్రమలతో కూడిన । చావు నీకు
నరులను బాధించు । నపుడెల్ల వ్రాతలో
పడిన శిక్షలు పయి । బడును నీకు
యూఫ్రటీస్ నది వద్ద । ఉన్న భూతాలకు
కలిగిన దుర్గతి–కలుగు నీకు
విజ్ఞప్తి పత్రిక । వెల్లడించక ముందె
కంపము భీతియు । కలుగు నీకు

తే॥గీ॥ హేడెస్సను మాట తలనొప్పి । హింస నీకు
హర్మ గెద్దోను యుద్ధం । హడలు నీకు
కడతరుగని గొయ్యియె మొట్టి । కాయ నీకు
అగ్నిగుండ మనంత ని । రాశ నీకు

# పరిత్యాగ పత్రిక

ఓ సాతానా! నీవంటే మాకు ఇష్టము లేదు. గనుక నీకు పరిత్యాగపత్రిక ఇస్తున్నాము. **ఇది రాకడ వరకు చెల్లును.** ఆ తరువాత మేము నీకు కనబడనే కనబడము. మా పరిత్యాగ పత్రిక శాశ్వతము వరకు పనిచేస్తుంది.

## పరిత్యాగ పత్రిక కీర్తన వచనము

పోపొమ్ము ఓ లోకమా! చాలిక చాలు – నీ పొందు మేమొల్లము = పోపొమ్ము ఓ సాతానా! చాలిక చాలు – నీ పొందు మేమొల్లము.

***'ఓ సాతానా!'*** అనుమాటకు బదులుగా, ఈ క్రింది పదములు ఉపయోగించి పాడవలెను.

ఓ పాపమా, ఓ పాప ఫలితమా, ఓ దయ్యమా, ఓ భూతమా, ఓ రోగమా, ఓ దుఃఖమా, ఓ లోపమా, ఓ శోధనా, ఓ మందమా, ఓ కంపమా, ఓ దుర్దశా, ఓ పాప నైజమా, ఓ మరణమా, ఓ నరకమా, ఓ హేడెస్సా.

................

# సమర్పణ ప్రార్థన

## (స్తుతులు, సమర్పణ, ప్రార్థనలు)

**స్తుతులు:-**

1. దేవా తండ్రీ! నా నిమిత్తమై సమస్తమును కలుగజేసిన తండ్రీ! అనుదినము మాకు కావలసినవన్నియు అందించు చున్న తండ్రీ! నేను అందుకొనలేని బిడ్డనైనను మానకుండ అందించుచున్న తండ్రీ! నన్ను కలుగజేసిన తండ్రీ! నా ప్రియుడవైన తండ్రీ! నా దేవా! నా ప్రభువా! నా పోషకుడా! నా రక్షకుడా! నా సర్వమా! నీకనేక నమస్కారములు. తండ్రీ! సృష్టి మూలముగా మాత్రమేకాక, నీ కుమారుని మూలముగా కూడ నన్ను నీ బిడ్డగా ఏర్పరచు కొన్నందులకై నీకనేక నమస్కారములు.

నీ దానముల మూలముగాను, నీ సహింపు మూలము గాను, నీ నడిపింపు మూలముగాను, మా కష్టములు నివారణచేయు నీ క్రియల మూలముగాను, నీవు మాకు చేయు ఉపకారముల మూలముగాను నాకు నీవు చూపుచున్న ప్రేమను తలంచుకొని నిన్ను స్తుతించు చున్నాను, గాని నా స్తుతి నీ ప్రేమ ఎదుట ఏ మాత్రము! నా అంతరంగమందున్న కృతజ్ఞత నీ అనంత ప్రేమ ఎదుట ఏ మాత్రము! నేను ఏ పనియు ముట్టుకొనక స్తుతి

మాత్రమే చేసినను, అది సహితము నీ కనికరము ఎదుట మిక్కిలి స్వల్పమై యుండును. ఆ స్వల్ప స్తుతులను కూడ నీవు హస్తార్పణముగా అందుకొనుచున్నావు, గనుక నీకు వందనములు. నీవు నన్ను నేటివరకు కాపాడుచు, నడిపించుచు వృద్ధిలోనికి తీసికొని వచ్చుచున్న నీ శక్తిని తలంచుకొని స్తుతించుచు, ఇక ముందునకుకూడ నా విషయములో ఇట్టి కార్యములు చేయుచుందువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాను. నా జీవితాంతమందు నిశ్చయముగా నన్ను పరలోకమునకు చేర్చుకొందువని నిరీక్షించుచున్నాను. నీకనేక వందనములు.

2. 1) అనాది దేవా! అనంత దేవా! ఉన్నదేవా! సృష్టింపబడకుండ ఉన్న దేవా! ఈ నీ గొప్ప తనమునకు అనేక స్తోత్రములు.

2) అనంత దేవా! నీవు ఎల్లప్పుడు ఉండగల దేవుడవు. గనుక నీకు స్తోత్రములు. నీవు ఎల్లప్పుడు ఉండువాడవు గనుక నీకు అనంత స్తోత్రములు.

3) జీవమైయున్న దేవా! నాలోని జీవము నా బలహీనతనుబట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చుచున్నప్పుడు మరల నాలో నూతన జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవ స్తోత్రములు.

Bible Mission HQ Guntur

4) శక్తిమంతుడవగు దేవా! నా విషయములో ఎంత గొప్ప కష్టమైన పనియైనను, అసాధ్యమైన పనియైనను చేయగలవు గనుక నీకు నా శక్తికొలది వందనములు.

5) జ్ఞానివైయున్న దేవా! నీవు జ్ఞానివి గనుక నా కష్టములు, నా కోరికలు నేను నీకు చెప్పుకొనకముందే నీకు తెలిసేయున్నవి. అందుచేతనే నీవు నా కోర్కెలు తీర్చగలవు. నా కోర్కెలు నెరవేర్చుటకు ఎన్నో చిక్కులు అడ్డముగానున్నను, ఆ చిక్కులన్నియు విడదీసి నా కోర్కె నెరవేర్చగల జ్ఞానోపాయము నీకు గలదు. గనుక నీకు నాకు తెలిసినన్ని వందనములు. నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు చేయుచున్నాను.

6) పరిశుద్ధుడవైన దేవా! నీవు నన్నును, సమస్తమును కలుగజేసినప్పుడు పరిశుద్ధముగానే కలుగజేసినావు గాని పాపప్రవేశమును బట్టి నాకు అపరిశుద్ధత కలిగెను. అయినను నీ పరిశుద్ధతనుబట్టి నాకు మరల పరిశుద్ధత దయచేయగలవు. గనుక నిష్కళంకమైన పరిశుద్ధ మనస్సుతో నీకు స్తుతి చేయుచున్నాను.

7) ప్రేమాస్వరూపివైన తండ్రీ! భూలోకమందలి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రేమించుటకన్నను, నన్ను నీవు ఎంతో ఎక్కువగా ప్రేమించుచున్నావు కాబట్టి నీకు నా వందనములు.

8) న్యాయస్వరూపివైన దేవా! నేను పొరబాటులో నున్నప్పుడు న్యాయమైనరీతిగా నన్ను గద్దించి, ప్రేమతో శిక్షించు దేవుడవు గనుక నీకు వందనములు ఆచరించుట న్యాయమైయున్నది. గనుక నీకు వందనములు ఆచరించు చున్నాను.

9) నిరాకారుడవైన దేవా! నా బలహీనతనుబట్టి నేను నిన్ను చూడలేకపోయినను నీవు నన్ను చూచుచున్నావు. నీవు నిరాకారుడవు అయినప్పటికిని నాకు ఉపయోగకరమైన శరీరాకారమును దయచేసినావు, మరియు నా ఆత్మకు నిరాకారము అనుగ్రహించినావు. కాబట్టి నా శరీరముతోను, నా ఆత్మతోను నిన్ను స్తుతించుచున్నాను.

10) సర్వవ్యాపివైయున్న తండ్రీ! నీవు పరలోకమందును, అన్ని స్థలములలో నుండగలవాడవు గనుక నీకు స్తోత్రములు. నేను ఎక్కడునున్న నీవు అక్కడుందువు, ఉండగలవు. నీవు నాకు జతగా నుండగలవు, ఉండి సహాయము చేయగలవు, **'నేను ఒంటరిగా నున్నాను'** అను చింత లేకుండా చేయగలవు గనుక నీకు వందనములు. అన్ని స్థలములలో నీకు వందనములు.

11) స్వతంత్రుడవైన ప్రభువా! సమస్త కార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ! నీకు స్తోత్రములు. నేనుకూడ స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహింపగలవు.

నీమీద మాత్రమే ఆధారపడి నాలోని స్వతంత్రతనుబట్టి, నా కార్యములు చేసికొనగల స్థితి అనుగ్రహించినావు గనుక నీకు స్తోత్రములు, స్వేచ్ఛాపూర్వకమైన స్తోత్రములు. బలవంతముగా కాక కేవలము స్వతంత్రముగా నిన్ను స్తుతింపగోరుచున్నాము. నీ గుణములన్నియు నాకుకూడ అనుగ్రహించుట వలన నీలక్షణరూపము, నీ కోరిక నాకు అనుగ్రహించినావు. అన్నియు అనుగ్రహించి ఒక్క స్వతంత్ర లక్షణముగాని అనుగ్రహింపకున్న యెడల తక్కినవన్ని ఇచ్చిన ప్రయోజనము లేదు. గనుక స్వాతంత్ర్య లక్షణము ఇచ్చినందుకు స్తోత్రములు.

12) తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను పేరులతో బైలుపడిన త్రియేక దేవుడవైన తండ్రీ! నీ ప్రత్యక్షత విషయమై నీకనేక వందనములు. నీవు నాకు దాగియుండు దేవుడవుకావు గాని బైలుపడు దేవుడవు. నీ లక్షణములు, నీ క్రియలు, నీ గొప్పతనము నాకు బైలుపర్చు దేవుడవు గనుక నీకు వందనములు. నీవు ఒక్కడవుగాను, ముగ్గురుగాను బైలుపడినావు. నీ మర్మము మాకు తెలియదు గాని నమ్ముచున్నాము. నేను నీయొద్దకు పరలోకమునకు జేరినప్పుడు తెలిసికొనగలను. నా పరిమిత జ్ఞానస్థితితో, నీ అపరిమిత జ్ఞానస్థితిని ఎట్లు తెలిసికొనగలను? అనంతకాలము నీ విషయములు క్రొత్త

క్రొత్తగా తెలిసికొనుచునే ఉందును. నీ ప్రత్యక్షతకును నేను తెలిసికొనుటకు అంతములేదు గనుక నీకు అంతము లేని స్తుతులు చెల్లించుచున్నాను.

13) మహిమాస్వరూపీ! అనంత స్వరూపీ! నేను నిత్యము నీ మహిమ కొరకు నీ ముఖ దర్శనములో, నీ సన్నిధిలో, నీ సహవాసములో మిగుల ఆనందముగా గడుపగల స్థితి దయచేయుదువని నమ్ముచు నీకనేక వందనములు చేయుచున్నాను.

14) మాకు శరీరమును అనుగ్రహించిన దేవా! నీకు వందనములు. ఈ శరీరము పాపశరీరమైనందున దీనిని పరిశుద్ధ శరీరముగా మార్చుచున్నావు. తుదకు నాకు మహిమ శరీరము ఇచ్చి నీయొద్దకు తీసికొని వెళ్లుదువు. గనుక నీకు వందనములు. నీవు మూడు విధములుగా బైలుపడినావు. అట్లే నాకు మూడు విధములైన స్థితులు అనుగ్రహించినావు. జీవము, శరీరము, ఆత్మ అను మూడు స్థితులు దయచేసినందుకు నీకు వందనములు. ఈ మూడు కలిపి నన్ను ఒక వ్యక్తిగా నిలిపినావు గనుక నీకు స్తోత్రములు. నేను ఒక విధముగా నీకు బిడ్డవలె నున్నాను. మరియొక లెక్కకు మూడుగానున్నాను. ఈ విచిత్రమైన సృష్టి నిమిత్తమై నీకు వందనములు. తండ్రీ! నీవు నాకు ఇచ్చినవన్నియు నేను నిలుపుకొనునట్లు నాకు తోడ్పడుదువని నమ్మి నిన్ను వందించుచున్నాను.

# రాకడ ప్రార్ధనలు - స్తుతులు

1. ఒక అబ్బాయి దూరదేశములోనుండి 'నేను వచ్చుచున్నానని' ఉత్తరము వ్రాసెను. ఆ అబ్బాయి ఇంటివారు ఆ ఉత్తరము చూచుకొని ఆనందించి, ఆ అబ్బాయి కొరకు ఎదురు చూతురుకదా! అట్లే యేసు ప్రభువు వచ్చెదనని చెప్పిరిగదా! వచ్చెదనని చెప్పిన ఆ అబ్బాయి రాకుండునా? ఎప్పుడో ఒకప్పుడు వచ్చునుగదా! ఆ అబ్బాయి ఇంటివారు అతనికొరకు ఎదురు చూచినట్లుగా మనమును యేసు ప్రభువు యొక్క రాకకై ఎదురుచూచిన యెడల, ఆయన వచ్చినప్పుడు ఆయన ఆగమనములో, ఆయనతో ఎగిరి వెళ్ళగలము. అట్లు ఎదురు చూడగల మనస్సు అనుగ్రహింతువని నమ్మి ఓ ప్రభువా! నిన్ను వందించు చున్నాము.

2. ఆ అబ్బాయి ఫలాని ఓడకు వచ్చుచున్నానని వ్రాసెను. ఆ ఇంటివారు కాకినాడకు ఓడలో వచ్చుచున్న అబ్బాయిని కలిసికొనుటకు వెళ్ళిరి. ఓడ వచ్చినది గాని ఆ అబ్బాయి ఎందుకో ఆ ఓడమీద రాలేదు. ఆ ఇంటివారు ఆ ఓడను చూచి, అబ్బాయి రానందున తిరిగి ఇంటికి వెళ్ళిపోయిరి. అయితే ఆ అబ్బాయి రెండవ ఓడమీద దిగినాడు. తన ఇంటివారెవరును తనను కలిసికొనుటకు రానందున తిరిగి వెనుకకు వెళ్ళిపోయినాడు. అలాగే

యేసుప్రభువు రాకడ ఆలస్యమైనందున అనేకులు వెనుకకు వెళ్ళిపోవుదురు. ఆ అబ్బాయి రెండవ ఓడకు వచ్చినట్లుగా ప్రభువుకూడ వచ్చి, సిద్ధపడియున్నవారిని తనతోకూడ పైకి తీసికొని వెళ్ళును. గనుక ఆయన రాకడ ఆలస్యమైనందున ఆగిపోక, ఆయనతో వెళ్ళుటకు సిద్ధము చేయుమని వేడుకొనవలెను. ఓ ప్రభువా! నీ రాకడ ఆలస్యమైనను మేము వెనుకకు తిరిగిపోవువారిలో చేరకుండ, ఎల్లప్పుడు సిద్ధపడియుండు కృప దయ చేయుదువని నమ్ముచు నీకు స్తోత్రములు చెల్లించు చున్నాము.

3. ఒక యౌవనస్తుడు తన భార్యకు నేను ఫలాని బండికి వచ్చుచున్నాను, ఆ బండికి నీవు వచ్చి నన్ను కలిసికొనవలెను, లేనియెడల నేను ఇంటికి రాను అని వ్రాసెను. అతని భార్య వంటలు మొ॥నవన్నియు తయారు చేసికొని స్టేషనుకు వెళ్ళెను. ఆ దినము బండి రెండు గంటలు ఆలస్యమైనందున ఆమె ఇంటికి వెళ్ళెను. ఆ తరువాత బండి వచ్చినది. అతడు దిగి ఆమె కొరకు అంతా చూచి, ఆమె కనబడనందున విచారించి, ఆ బండికే వేరొకచోటికి వెళ్ళెను. అలాగే మనమును ఆయన రాక కొరకు ఎదురుచూచి, తీరా వచ్చుసరికి వెనుకకు వెళ్ళిపోవుదుము. రాకడలో వెళ్ళలేము. గనుక ఆలస్యమైనను ఆయన వచ్చువరకు కనిపెట్టి చూచుచు,

సిద్ధపడవలెను. అప్పుడు రాకడలో వెళ్ళగలము. ఓ ప్రభువా! మేము కనిపెట్టుచు సిద్ధపడుచుండగల కృప దయచేయుదువని నమ్మి నీకు స్తుతులర్పించుచున్నాము.

4. ఒకరు ప్రయాణమునకు వెళ్ళవలెనని గోదావరి స్టేషనుకు వచ్చుసరికి బండి దాటిపోయినది. అతడు వెంటనే తెలివితేటలు గలిగి రాజమండ్రి స్టేషనులో బండి అరగంట ఆగునని తెలిసికొని, వెంటనే రిక్షా కట్టించుకొని గబగబ పరుగెత్తించి స్టేషను చేరెను. వెంటనే టిక్కెట్టు కొని బండిలో ప్రవేశించినాడు. అలాగే మనమును తెలివితేటలు ఉపయోగించుకొని, గబగబ పనులు చేసికొని రాకడకు సిద్ధపడవలెను. ఒకవేళ వెనుకబడినను ఏదో ఒక విధముగా అందుకొనవలెను. ఆ ప్రయాణీకునివలె తెలివితేటలు ఉపయోగించి రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి నీకు స్తోత్రములు చెల్లించు చున్నాము.

5. ఒకడు మగ్గముపై దుప్పటి నేయుచు, ఈ కొంచెమే ఉన్నదిగదా! అతి త్వరగా నేసి వెంటనే వస్తాను, మీరు వెళ్ళి బండికి టిక్కెట్టు తీసికొనండని చెప్పెను. అతడు ఆ దుప్పటిని త్వరత్వరగానేసి, ఎగబెట్టేసరికి ఆలస్యమైనది, బండికి అందుకొనవచ్చుననుకొన్నాడు గాని పనులవలన ఆలస్యమైనందున, అతడు వెళ్ళుసరికి ఆ బండి వెళ్ళి

పోయెను. అలాగే ఆయా పనులు పెట్టుకొని బండిని అతడు దాటిపోజేసినట్లు మనమును నానాపనులు పెట్టుకొని రాకడలో వెళ్ళలేక వెనుకబడి పోవుదుము. ఓ ప్రభువా! నీ రాకడ విషయములో మేమట్టి అశ్రద్ధ చూపకుండ మమ్మును సిద్ధపర్చుమని నమ్మి నీకు ప్రణుతులు చెల్లించుచున్నాము.

6. కొందరు అనేకమైన పనులు కల్పించుకొని పనులలోనే పడిపోయి ఈదులాడుకొనుచు, ప్రభువుయొక్క రాకడను మరచి పోవుదురు. ఇంతలో ఆయన వచ్చి ఎదురుచూచుచు, సిద్ధపడినవారిని తీసికొనిపోవును. పనులు ముగించుకొని తేరి చూచునప్పటికి రాకడ వచ్చి వెళ్ళిపోవును. పనులు ముగించుకొని తేరి చూచునప్పటికి రాకడ వచ్చి వెళ్ళిపోవడము కూడ జరుగును. అలాగే సమయమంతా పనులు, పనులు అని పనిపాటలతోనే కాలము గడుపువారు రాకడలో ప్రభువును కలిసికొనలేరు. మేమట్లు లోకపు పనులలో మునిగి, నీ రాకడను నిర్లక్ష్యము చేయకుండ ఉండే కృప దయచేయుదువని నమ్మి నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

7. ప్రతి దినము రాకడ ప్రార్థన, రాకడ వాక్యములు, రాకడ తలంపు కలిగియుండక పోయిన రాకడలో ఎత్తబడలేరు. గనుక నిత్యమును, ఏ పనిచేయుచున్నను

రాకడ ధ్యానము, రాకడ తలంపు కలిగియుండిన రాకడలో ఎత్తబడగలరు. నీ రాకడ తలంపు నిత్యము మాలో నుంచుదువని నమ్ముచున్నాము. నీకు నిత్య స్తోత్రములు.

8. ఒక రైతు కళ్ళమునందున్న ధాన్యములోని రాళ్ళను ఏరి పారవేసి, జల్లెడలోవేసి జల్లించి, చేటలోవేసి చెరిగివేసి, శుభ్రముగానున్న గట్టి గింజలను జాగ్రత్త చేసెను. అలాగే మనలోనున్న చెడు ఆలోచనలు, చెడు పనులు మొదలగు రాళ్ళన్నిటిని, చెత్త, పొట్టువంటి పాపములను జల్లించి చెరిగివేసికొనవలెను. అప్పుడు మనమును గట్టిగింజలుగా ఏర్పడి రాకడలో ఎత్తబడగలము. ఓ ప్రభువా! అట్లు మమ్మును మేము శుభ్రము చేసికొనగల సహాయము దయచేయుదువు గనుక నీకు నిత్యమంగళ స్తోత్రములు.

9. ఒక స్త్రీకి చంటి బిడ్డ కలదు. ఆ బిడ్డ ఆడుకొనుచు బురద చేసికొనగా, బిడ్డను ఆమె నీళ్ళతో కడిగి శుద్ధి చేసినది. అయితే ఆ బిడ్డ మరల ఆడి మరల బురద చేసికొనగా, తిరిగి తల్లి కడిగివేసినది. అనేకమార్లు ఆ బిడ్డ బురద చేసికొనగా అలాగే తల్లి అనేకమార్లు కడిగి శుద్ధిచేసిన రీతిగా, మనమును మన మనస్సులోనికి చెడ్డ తలంపులు వచ్చినప్పుడు, వెంటనే యేసు రక్తముతో ఆ పాపమును శుద్ధిచేసుకొను అలవాటు కలిగియుండవలెను. వెంటనే శుద్ధిచేసికొనకపోయిన ఆలస్యమైపోవును. గనుక

(పాపపు తలంపు రాగానే), పాపములో పడగానే ప్రభువు రక్తముతో పవిత్రము చేసికొనవలెను. ఎన్ని మారులైనను 'యేసు రక్తమే జయము' అనునది అలవవాటు చేసికొనవలెను. ఓ ప్రభువా! మేమట్లు శుద్ధిచేసికొని, నీ రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి వందించుచున్నాము.

10. దూర ప్రయాణము చేయువారు ఉదయం కాఫీ, మధ్యాహ్నము, సాయంకాలము భోజనము, 4 గంటలకు మరల కాఫీ తీసికొనినగాని ప్రయాణము చేయలేరు. అలాగే మనమును ఆకలి వేసినప్పుడెల్ల ప్రభువుయొక్క శరీర రక్తములు అను ఆహారమును తీసికొని అనుభవింపక పోయిన రాకడ ప్రయాణము చేయలేము. గనుక సంస్కార భోజనము పుచ్చుకొనిన రాకడలో వెళ్ళగలము. ఓ ప్రభువా! నీవు ఏర్పాటు చేసిన సంస్కారపు విందును అనుభవించి, బలముపొంది, నీ రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి నీకు నుతలర్పించు చున్నాము.

11. క్రైస్తవ సంఘములోని కొందరు రాకడ సమీపమను చున్నారు. కొద్దిమంది మాత్రమే నమ్ముచున్నారు, కొందరు నమ్ముటలేదు. ఓ ప్రభువా! ఒకవేళ నమ్మనివారు, నమ్మిన యెడల వారిని రాకడకు సిద్ధపరచుము. నమ్మినవారిని ఇంకను సిద్ధపర్చుము. నమ్మని వారికి నమ్మకము పుట్టించుము. నమ్మిన వారిని,

నమ్మలేని వారిని, నమ్మనివారిని రాకడకు సిద్ధపర్చుము. ఇట్లు నీ సంఘమును రాకడకు ఆయత్తము చేయుదువని విశ్వాసించి స్తుతులర్పించుచున్నాము.

12. అన్యులలో ప్రభువును నమ్మినవారున్నారు, నమ్మనివారుకూడా ఉన్నారు. వారు సిద్ధపడుట ఎట్లు? ఎవరో ఒకరు వెళ్ళి, వారికి రాకడను గురించి బోధించ వలెను. లేనియెడల వారికి నమ్మకము కలుగదు. వారు సిద్ధపడినను సరే, సిద్ధపడకపోయినను సరే, వారిని కూడ సిద్ధపర్చుమని ప్రార్థించుచున్నాము.

13. గురుతులు అయిన తర్వాత రాకడ జరుగునని క్రైస్తవులు చెప్పుచున్నారు. అయితే ఎప్పుడును ఒకేలాగున్నది, ఈ గురుతులు ఎప్పుడును ఒకేరీతిగా నున్నవి, ఈ గురుతులన్ని ఇదివరకే ఉన్నవి, క్రొత్తవేమియు లేవు అని ఆక్షేపణ చేయు వారిని గురించి ప్రార్థించవలెను. గనుక భక్తులైనవారు గురుతులు ఏవేవి, ఏ సంవత్సరమున, ఏయే దేశములలో జరిగినవో, ఇంకా క్రొత్త గురుతులు ఏమి జరుగునో, బైబిలులో లేని ఎక్స్ట్రా (Extra) గురుతులు వ్రాయునట్లు ప్రార్థింపవలెను. ఇవి లోకమంతా తెలిసికొనునట్లు భక్తులు త్వరలో వ్రాయునట్లు ప్రార్థించ వలెను. ఓ ప్రభువా! అట్టి భక్తులనులేపి రాకడ గుర్తులను వ్రాసి, లోకమునకు చూపించు కృప దయచేయుదువని నమ్మి నీకు కృతజ్ఞతార్పణలు చెల్లించుచున్నాము.

14. లోకములో కొందరు సువార్త పత్రికలు అచ్చువేసి, అనేకులకు పంపుచున్నారు. వారు కేవలము దేవునివలన ప్రేరేపింపబడి, అట్టి వాటిని వ్రాసి అనేకులకు పంపుచున్నారు. అట్టి పత్రికలలో కొన్ని 1) నవీనకాల విషయములు తెలియచేయునవి, 2) మరికొన్ని రెండవ రాకడ విషయములు తెలియజేయునవి, 3) కొన్ని ప్రవచన కాల విషయములు తెలియజేయునవైయున్నవి. పై మూడు రకముల పత్రికలు వారు ఊరకనే అనేకులకు పంపు చున్నారు. వీటన్నిటిని ప్రభువు దీవించుచున్నారు గనుక ఆయనకు మంగళ స్తోత్రార్పణలు.

15. క్రీస్తుమతము పుట్టి 19 శతాబ్ధములు అయినది. ఈ 19 శతాబ్ధములలో ఏయే సంగతులు జరిగినవి, ఎందరు క్రైస్తవులైనది, ఎన్ని రాకడ గురుతులు జరిగినవి. ఏయే గురుతులు ఏయే కాలములో జరిగినవి, ఆ గురుతులు జరిగినపుడు వాటి పని ఏమిటయినది, ఆ గురుతులవలన ప్రభువునకు ఏమి మహిమ కలిగినది; ఈ విధముగా లోకములో జరిగిన మరియు జరుగుచున్న విషయములు ఒక పుస్తకములో అయ్యగారు వ్రాసి యుంచిరి. ఆ పుస్తకమును అయ్యగారు జాగ్రత్తగా దాచి ఉంచగా, ఎవరో ఒకరు మరల పంపించెదనని తీసికొని వెళ్ళిరని తెలిసి, ఆ పుస్తకము కొరకు వ్రాయగా, పంపించెద నన్నారుగాని ఇంతవరకు పంపలేదు. ఆ పుస్తకము మరల దొరికిన యెడల

రాకడ గురుతులన్నియు అందులోగలవు. గనుక ఎంత పనియైనను చేయవచ్చును. అతి త్వరలో దొరుకునట్లు ప్రార్థన చేయండి. ఆ పుస్తకము దొరికినప్పుడు, అన్యులు మరియు క్రైస్తవులు ఏలాగున్నది, ఏమేమి పొందినది తెలియగలదు. ప్రార్థన: దయగల తండ్రీ! నీ రాకడకు కొందరు సిద్ధపడుచున్నారు, కొందరు సిద్ధపడుటలేదు. కొందరు సిద్ధపడవలెనని తలంచుచున్నారు. కొందరు సిద్ధపడవలెనని ప్రయత్నము చేయుచున్నారు, గాని సిద్ధపడలేక పోవుచున్నారు. గనుక మమ్ములనందరిని నీ రాకడకు సిద్ధపరచి, నీతో మేమందరము బయలుదేరు భాగ్యము అనుగ్రహించి సిద్ధపరచి, స్థిరపరచుము.

16. పౌలురాజు తైలాభిషేకమును, ఆత్మను పొందినను, యుద్ధములలో జయము పొందినను చివరకు తప్పిపోయెను. అలాగే కొందరు క్రైస్తవులు చివరివరకు అనగా రాకడ వరకు బాగుండి, రాకడ ఈ వేళో రేపో అనగా తప్పిపోయి నిరాశపడుదురు. మేము అట్టివారము కాకుండా కాపాడుదువని నమ్మి నిన్ను స్తోత్రించుచున్నాము.

17. ఎప్పుడునూ రక్షణను గురించిగాని, రాకడను గురించిగాని, విననివారు ఆఖరు దినమున విని తయారు కావచ్చును. ఏలాగనగా రైలుబండికి ఆలస్యముగా బయలు దేరిన కొందరు పరుగెత్తుకొని వచ్చి, రైలు కదిలే సమయములో

ఎక్కుదురు గదా! సిలువ మ్రానుమీద, దొంగ ఆ క్షణములో మారుమనస్సు పొందెనుగదా! అట్లు మేము రాకడలో పాల్గొనుకృప దయచేతువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

18. తీరా మరణ సమయమున కొందరు మారు మనస్సు పొంది, బహు కొద్దిమంది రాకడకు సిద్ధపడుదురు. అది నీ కృప. అట్టి కృప మాకును దయచేయుము. నీకే ప్రణుతులు.

19. కొందరు మంచి పనిమీద ఉండి, ముగించునప్పటికి రాకడ వచ్చును. భోజనము సగము తినుచున్నప్పుడు, రాకడ వచ్చినయెడల, తయారుగా నున్నవారు వెళ్ళిపోవుదురు. వేవే స్థితిలో ఆ సమయమునకు ఉన్నను, రాకడలో ఎత్తబడగల కృప దయచేయుదువు గనుక నీకు మా నమస్కారములు.

20. కొందరు నిద్రలో ఉండగానే రాకడలో ఎత్తబడుదురు గనుక నీకు మా హృదయ వందనములు.

21. ఒకరు, మరియొక గ్రామములో ఎవరో చనిపోయినారని విని ఏడ్చుచుండగా రాకడలో ఎత్తబడుదురు గనుక నీకు స్తుతులు.

22. ఒకరు స్వస్థానమునకు వెళ్ళుటకు, అనగా కుమార్తె తండ్రి ఇంటికి వెళ్లుటకు ఆశించును. అలాగే సంఘము ప్రభువుయొక్క రాకడ కొరకు చూచుచున్నది.

అనగా పెండ్లికుమార్తె, పెండ్లికుమారుని రాక కొరకు ఎదురు చూచుచున్నది. గనుక ఎదురుచూచు సంఘము రాకడలోనికి వెళ్ళును. ఎదురు చూడనివారు రాకడలోనికి వెళ్ళరు. మేము ఎదురు చూచు వారిగానుండు వీలు కలిగింతువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

23. ఒక గ్రామములో చాలా కలహములుండెను. ఒకరు జ్వరముతో నున్న తన కుమార్తెను చూచుటకు వచ్చి, కలహముల యొక్క భయంకర స్థితినిగూర్చి వినెను. ఈ కలహములలో తన కుమార్తెను అక్కడ ఉంచుట అపాయమని తలంచి, తన ఇంటికి తీసికొనిపోయెను. అలాగుననే ఈ లోకము గత్తర లోకము, వ్యాధుల లోకము, పాప లోకము, పాప ఫలితములున్న లోకము, అవస్థల లోకము, కరవుల లోకము, వ్యాధుల లోకము, విష పురుగుల లోకము, నిరీక్షణ లేని లోకము, మరణలోకము, దయ్యముల లోకము, దయ్యములకు లోబడిన మనుష్యులున్న లోకము. గనుక ప్రభువు మనలను మోక్ష మందిరమునకు తీసికొని వెళ్ళుటకు శీఘ్రముగా వచ్చును. ఇదే రెండవ రాకడ. తండ్రి కుమార్తెను తీసికొని వెళ్ళునప్పుడు "రాను" అని చెప్పదుగదా! అలాగే మనము కూడా మేఘములోనికి 'రాము' అని చెప్పకూడదు. 'ప్రభువా! తండ్రీ! సిద్ధముగా నున్నాను' అని చెప్పవలెను. అట్లు

చెప్పగల కృప దయచేయుదువని నమ్మి నిన్ను స్తుతించు చున్నాము.

24. సముద్రముయొక్క కెరటములు రేయింబగళ్లు (పగలు, రాత్రి) గాలివలన శబ్దము చేయుచున్నవి. సముద్ర తరంగములను రేపుచున్న గాలివలె దైవాత్మ భక్తులయొక్క హృదయములను రేయింబగళ్ళు కదిలించుచున్నది. అప్పుడు వారు రక్షణ పొంది అందులకు స్తుతింతురు. మరియు రాకడ వచ్చుచున్నదని స్తుతించుచు సంతోషింతురు. ఓ ప్రభువా! అట్టి రెండు విధములైన స్తుతులు మాకు నేర్పుము.

25. దేవా! నీవు ఏనాడు సూర్య చంద్ర నక్షత్రములను సృజించినావో, ఆ దినము మొదలు నేటివరకు అవి ఆకాశ మండలములోనుండి ప్రకాశించుచున్నవి. జ్యోతులు తమకు నియమింపబడిన మార్గములో ప్రయాణము చేయుచునే ఉన్నవి. అలాగుననే మేము కూడ మా ఆనంద దీపములతో మా మార్గములలో నడచుచు, స్థిరముగా నుండునట్లు దీవించి నీ రాకడకు సిద్ధపరచుము. నీవు దయచేసిన రక్షణ, రాకడ భాగ్యములను గురించి నిన్ను మహిమపరచు కృప దయచేయుము.

26. దేవా! నీవు కలుగజేసి మాలో పెట్టిన ఆత్మ, ఎల్లప్పుడు నిన్నే తలంచునట్లు చేయుము. ఆత్మవైన నీతో

ఏకీభవించుటకు కృప దయచేయుము. మా ఆత్మతో నిన్ను స్తుతించు శక్తి దయచేయుము. మా ఆత్మ నీ యొద్దకు వచ్చువరకు రక్షణను గురించియు, రాకడను గురించియు, స్తుతించు ధోరణి దయచేయుదువని నమ్మి నీకు కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించుచున్నాము.

27. ప్రభువా! మా వ్రాత స్తుతులు నిజమైన స్తుతులుగా, నీకు ఇష్టమైన స్తుతులుగా మార్చివేయుము. వ్రాత ఎప్పటికైన చెరపవచ్చును గాని, నీ ఆత్మ సహాయము చేత వచ్చిన స్తుతి చెడిపోదు. అట్టి స్తుతి మాకు దయచేయుదువని నమ్మి నిన్ను వందించుచున్నాము.

28. ఓ దేవా! వ్రాత ఎంత నిశ్చయమో, ఎంత నిజమో, మా స్తుతికూడ అంత నిశ్చయము, నిజమైయుండుటకు కృప దయచేయుము.

29. రక్షణ ఎంత నిశ్చయమో రాకడ అంత నిశ్చయము. మేము స్తుతించుటయు, సిద్ధపడుటయు అంత నిశ్చయమై యుండునట్టి కృప దయచేయుము.

30. మేము పరలోకమునకు వచ్చునప్పుడు, మా పాత శరీరము ఇక్కడ విడిచివస్తాము. మా స్తుతులలోను, మా సిద్ధపడుటలోను, మా నమ్మికలోను ఉన్న కళంకములు ఇక్కడ విడిచిపెట్టు శక్తి దయచేయుము.

# ప్రకటన గ్రంథములోని స్తుతులు

1. ప్రకటన 1:6. మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలగును గాక! ఆమేన్.

2. ప్రకటన 1:18. భయపడకుము, నేను మొదటి వాడను, కడపటివాడను,జీవించువాడను, మృతుడనైతిని గాని ఇదిగో యుగ యుగములు సజీవుడనైయున్నాను. మరియు మరణము యొుక్కయు పాతాళ లోకముయొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి.

3. ప్రకటన 4:8 (4 జీవులు చేసిన స్తుతి) భూత వర్తమాన భవిష్యత్కాలములో ఉండు సర్వాధికారియు దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశు ద్ధుడు అని మానక రాత్రింబగళ్ళు చెప్పుచుండును. సింహాసనమందు ఆసీనుడైయుండి యుగయుగములు జీవించుచున్న వానికి మహిమయు, ఘనతయు కృతజ్ఞతా స్తుతులును కలుగునుగాక!

4. ప్రకటన 4:10-11. (24 గురు పెద్దలు చేసిన స్తుతి) సింహాసనమందు ఆసీనుడైయున్నవాని ఎదుట సాగిలపడి యుగయుగములు జీవించుచున్నవానికి నమస్కారము చేయుచు ప్రభువా, మా దేవా, నీవు

సమస్తమును సృజించితివి. నీ చిత్తమునుబట్టి అవి యుండెను. దానినిబట్టియే సృష్టింపబడెను. గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవని చెప్పుచు తమ కిరీటములను ఆ సింహాసనము ఎదుట వేసిరి.

5. ప్రకటన 5:9 (4జీవులు 24గురు పెద్దలు) నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలు విప్పుటకు యోగ్యుడవు. నీవు వధింపబడినవాడవై నీరక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను దేవుని కొరకు మనుష్యులనుకొని మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను, యాజకులుగాను చేసితివి. గనుక వారు భూలోకమందు ఏలుదురని క్రొత్త పాట పాడుదురు.

6. ప్రకటన 5:12 (దేవదూతల స్తుతి) వారు వధింపబడిన గొర్రెపిల్ల శక్తియు, ఐశ్వర్యమును, జ్ఞానమును, బలమును, ఘనతను, మహిమయు, స్తోత్రమును పొందనర్హుడవని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి.

7. ప్రకటన 5:13-14. (సమస్త సృష్టియు చేసిన స్తుతి) సింహాసనాసీనుడైయున్న వానికిని గొర్రెపిల్లకును స్తోత్రమును ఘనతయు, మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగుగాకయని చెప్పుట వింటిని. ఆ నాలుగు జీవులు- ఆమేన్ అని చెప్పగా ఆ పెద్దలు సాగిలపడి నమస్కారము చేసిరి.

8. ప్రకటన 6:9–10. (హతసాక్షులు చేసిన స్తుతి) వారు నాథా! సత్యస్వరూపి, పరిశుద్ధుడా, ఎందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతి దండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలు వేసిరి.

9. ప్రకటన 7:10 (రక్షింపబడిన 144వేల మంది చేసిన స్తుతి) సింహాసనము ఎదుట గొర్రెపిల్ల ఎదుటను నిలువబడి సింహాసనాసీనుడైయున్న మా దేవునికిని, గొర్రెపిల్లకును మా రక్షణ స్తోత్రమని మహా శబ్దముతో ఎలుగెత్తి చెప్పిరి.

10. ప్రకటన 7:11–12. (దేవదూతల స్తుతి) వారు సింహాసనము ఎదుట సాష్టాంగపడి ఆమేన్, యుగయుగముల వరకు మా దేవునికి స్తోత్రమును మహిమయు జ్ఞానమును కృతజ్ఞతాస్తుతియు ఘనతయు శక్తియు బలమును కలుగుగాకని చెప్పుచు దేవుని నమస్కారము చేసిరి ఆమేన్.

11. ప్రకటన 10:6 (పరలోకమునుండి దిగివచ్చిన బలిష్ఠుడైన దూత చెప్పినది) పరలోకమును అందులో ఉన్నవాటిని, భూమిని అందులో ఉన్నవాటిని, సముద్రమును అందులో ఉన్నవాటిని, సృష్టించి, యుగయుగములు జీవించుచున్న వాటితోడు ఒట్టుపెట్టుకొని ఇక ఆలస్యముండదుగాని దేవుడు తన దాసులగు ప్రవక్తలకు తెలిపిన సువార్త ప్రకారము దేవుని మర్మము సమాప్తమగునని చెప్పెను.

12. ప్రకటన 11:15. (పరలోకమునుండి దిగివచ్చిన శబ్దము) ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యమునాయెను. ఆయన యుగయుగముల వరకు ఏలుననెను.

13. ప్రకటన 11:17-18 (24గురు పెద్దలు చేసిన స్తుతి) వర్తమాన భూతకాలములలో ఉండు దేవుడవైన ప్రభువా! సర్వాధికారీ, నీవు నీ మహాబలమును స్వీకరించి ఏలుచున్నావు. గనుక మేము నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము. జనములు కోపగించినందున నీకు కోపము వచ్చెను. మృతులు తీర్పు పొందుటకును, నీ దాసులగు ప్రవక్తలకును పరిశుద్ధులకును, నీ నామమునకు భయపడువారికిని, తగిన ఫలము నిచ్చుటకును గొప్పవారేమి, కొద్దివారేమి భూమిని నశింపజేయువారిని నశింపజేయుటకును సమయము వచ్చియున్నదని చెప్పిరి.

14. ప్రకటన 12:9. (పరలోకమునుండి శబ్దము) కాగా సర్వలోకమును మోసపుచ్చుచు, అపవాదియనియు, సాతాననియు పేరుగల ఆదిసర్పమైన ఆ మహాఘట సర్పము పడద్రోయబడెను. అది భూమిమీద పడద్రోయబడెను. దాని దూతలును దానితోకూడ పడద్రోయబడిరి.

15. ప్రకటన 12:10-12 (పరలోకమందు) రాత్రింబగళ్ళు మన దేవుని ఎదుట మన సహోదరులమీద నేరము మోపువాడైన అపవాది పడద్రోయబడియున్నాడు.

గనుక ఇప్పుడు రక్షణయు, శక్తియు, రాజ్యమును మన దేవునివాయెను. ఇప్పుడు అధికారము ఆయన క్రీస్తుదాయెను. వారు గొర్రెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమునుబట్టియు వానిని జయించియున్నారు. గాని మరణము వరకు తమ ప్రాణములను ప్రేమించిన వారుకారు. అందుచేత పరలోకమా పరలోక నివాసులారా! ఉత్సహించుడి భూమి, సముద్రమా మీకు శ్రమ. అపవాది తనకు సమయము కొంచెమే అని తెలిసికొని బహు క్రోధము గలవాడై మీయొద్దకు దిగి వచ్చియున్నాడని చెప్పెను.

16. ప్రకటన 14:7. (దేవదూత చేసినది) మీరు దేవునికి భయపడి ఆయనను మహిమపరచుడి. ఆయన తీర్పుతీర్చు గడియవచ్చెను. గనుక ఆకాశమును, భూమిని, సముద్రమును, జలధారలను కలుగజేసిన వానికే నమస్కారము చేయుడి అని గొప్ప స్వరముతో చెప్పెను.

17. ప్రకటన 14:8 (వేరొక దూత) మహోద్రేకముతో కూడిన తన వ్యభిచార మద్యమును సమస్త జనములకు త్రాగించిన ఈ మహా బబులోను కూలిపోయెను అని చెప్పెను.

18. ప్రకటన 15:3-4. (క్రూరమృగమునకు లోబడని వారు చేసిన స్తుతి) ప్రభువా, దేవా, సర్వాధికారీ, నీ క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి, యుగములకు రాజా, నీ మార్గములు న్యాయములును, సత్యములునైయున్నవి. ప్రభువా, నీవు మాత్రము పవిత్రుడవు, నీకు భయపడని

వాడెవడు? నీ నామమును మహిమపరచని వాడెవడు? నీ న్యాయ విధులు ప్రత్యక్షపరచబడినవి గనుక జనములందరు వచ్చి నీ సన్నిధిని నమస్కారము చేసెదరని చెప్పుచు దేవుని దాసుడగు మోషే కీర్తనయు, గొర్రెపిల్ల కీర్తనయు పాడుచున్నారు.

19. ప్రకటన 16:5–7. (జలముల దేవదూత) వర్తమాన భూత కాలములలో ఉండు పవిత్రుడా, పరిశుద్ధుల రక్తమును, ప్రవక్తల రక్తమును వారు కార్చినందుకు తీర్పుతీర్చి వారికి రక్తము త్రాగనిచ్చితివి, దీనికి వారు పాత్రులే. నీవు ఈలాగు తీర్పు తీర్చితివి గనుక నీవు న్యాయవంతుడవని జలముల దేవదూత చెప్పగా వింటిని. అందుకు– అవును ప్రభువా, దేవా, సర్వాధికారీ, నీ తీర్పులు సత్యములును న్యాయములునైయున్నవని బలిపీఠము చెప్పుట వింటిని.

20. ప్రకటన 16:15–16. ఇదిగో నేను దొంగవలె వచ్చుచున్నాను. తాను దిగంబరుడుగా సంచరించుచున్నందున జనులు తన దిసమొలను చూతురేమో అని మెళకువగా ఉండి తన వస్త్రము కాపాడు కొనువాడు ధన్యుడే.

21. ప్రకటన 17:14. (దూత చెప్పినది) వీరు గొర్రెపిల్లతో యుద్ధము చేతురుగాని, గొర్రెపిల్ల ప్రభువులకు ప్రభువును, రాజులకు రాజునై యున్నందునను,

తనతోకూడ ఉండినవారు పిలువబడినవారై, ఏర్పర్చబడిన వారై నమ్మకమైనవారై యున్నందునను, ఆయన ఆ రాజులను జయించును.

22. ప్రకటన 18:20 (దూతలే చెప్పినవి) పరలోకమా, పరిశుద్ధులారా, అపోస్తులులారా, ప్రవక్తలారా, దానిగూర్చి ఆనందించుడి. 'ఏలయనగా దానిచేత మీకు కలిగిన తీర్పుకు ప్రతిగా దేవుడు ఆ పట్టణమునకు తీర్పుతీర్చి యున్నాడు'.

23. ప్రకటన 19:1-7 (పరలోకములోని జయ శబ్దము) ప్రభువును స్తుతించుడి, రక్షణ మహిమ ప్రభావములు మన దేవునికే చెల్లును. ఆయన తీర్పులు సత్యములును న్యాయములునైయున్నవి. తన వ్యభిచారముతో భూలోకమును చెరిపిన గొప్ప వేశ్యకు ఆయన తీర్పు తీర్చి తన దాసుల రక్తమునుబట్టి దానికి ప్రతిదండన చేసెను. మరి రెండవసారి వారు ప్రభువును స్తుతించుడి అనిరి. ఆ పట్టణపు పొగ యుగయుగములు పైకి లేచుచున్నది. అప్పుడు ఆ 24గురు పెద్దలును నాలుగు జీవులును సాగిలపడి ఆమేన్. ప్రభువును స్తుతించుడి అని చెప్పుచు సింహాసనాసీనుడగు దేవునికి నమస్కారము చేసిరి. మరియు మన దేవుని దాసులారా, ఆయనకు భయపడు వారలారా, కొద్దివారేమి, గొప్పవారేమి మీరందరు ఆయనను స్తుతించుడి అని చెప్పుచున్న యొక స్వరము సింహాసనము నొద్దనుండి వచ్చెను. అప్పుడు గొప్ప జన

సమూహపు శబ్దమును, విస్తారమైన జలముల శబ్దమును, బలమైన ఉరుముల శబ్దమును పోలినయొక స్వరము సర్వాధికారియు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు. ఆయనను స్తుతించుడి. గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది. ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొన్నది. గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమ పరచెదమని చెప్పగా వింటిని.

## ప్రకటన గ్రంథములోని ఏడు ధన్యతలు

1. దేవుని వాక్యము చదువువాడును ధన్యుడు, వాటిని విని గైకొనువారును ధన్యులు 1:3.
2. ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు 14:13.
3. మెళకువగా నుండి తన వస్త్రము కాపాడుకొను వాడు ధన్యుడు. 16:16.
4. గొఱ్ఱెపిల్ల పెండ్లివిందుకు పిలువబడినవారు ధన్యులు 19:9.
5. మొదటి పునరుత్థానములో పాలుగలవారు ధన్యులు 20:6.
6. ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. ఈ గ్రంథములోని ప్రవచన వాక్యములు గైకొనువాడు ధన్యుడు 22:7.
7. జీవ వృక్షమునకు హక్కుగలవారై, గుమ్మముల గుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు 22:14.

# దీవెనల జాబితా

1. పాప ప్రేరేపణ గలవారలారా! దేవుడు మీకు పాప విసర్జన శక్తినిచ్చి మిమ్మును దీవించును గాక!
2. అనారోగ్యవంతులారా! దేవుడు మీకు ఆరోగ్యమిచ్చి మిమ్మును దీవించును గాక!
3. లేమిగల వారలారా! దేవుడు మీకు కలిమినిచ్చి మిమ్మును దీవించును గాక!
4. బిడ్డలు లేనివారలారా! దేవుడు మీకు శిశుదానము చేసి మిమ్మును దీవించును గాక!
5. భూత పీడితులారా! దేవుడు మీకు విముక్తిని దయచేసి మిమ్మును దీవించును గాక!
6. మందమతులారా! దేవుడు మీకు నిర్మలమైన జ్ఞానము నిచ్చి మిమ్మును దీవించును గాక!
7. శత్రుబాధ గలవారలారా? దేవుడు మీకు శత్రు బాధ లేకుండా జేసి మిమ్మును దీవించును గాక!
8. అన్యాయము పాలగుచున్న వారలారా! దేవుడు మీకు న్యాయమనుగ్రహించి మిమ్మును దీవించును గాక!
9. ఋణబాధగల వారలారా! దేవుడు మీకు ఋణ బాధ తీర్చి మిమ్మును దీవించును గాక!

Bible Mission HQ Guntur

10. యుక్త సమయమున పెండ్లి సమకూడని వారలారా! దేవుడు మీకు మంచి జతనేర్పరచి మిమ్మును దీవించును గాక!

11. కుటుంబ కలహములు గల వారలారా! దేవుడు మీ కలహములు నాపు జేసి, ఐకమత్యత కలిగించి మిమ్మును దీవించును గాక!

12. నానా విధములైన చిక్కులు గల వారలారా! దేవుడు మీ చిక్కులను విడదీసి మిమ్మును దీవించును గాక!

13. దైవభక్తి కుదరని వారలారా! దేవుడు మీకు మనో నిదానమును, స్థిరభక్తావేశమును పుట్టించి మిమ్మును దీవించును గాక!

14. దేవుని యెడల అపనమ్మిక, భీతి, విసుగుదల, తొందరపడు గుణము, ఆనాలోచన, చింత, నిరాశ, మొదలగునవి మీలోనికి చేరకుండునట్లు దేవుడు మిమ్మును దీవించును గాక!

15. జీవాంతమందు మీకు మోక్షభాగ్యము లభించునట్లు, దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమేన్.

..............

Bible Mission HQ Guntur